క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థి మమతను అభినందిస్తున్న హెచ్ఎం రాములు నాయక్

పాణ్యం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పి. మమత రాష్ట్ర స్థాయి త్వైకాండో అండర్‌-14 విభాగానికి ఎంపికై నట్లు హెచ్ఎం రాములు నాయక్ గురువారం తెలిపారు. ఈనెల 6న కర్నూలులోని ఇండోర్ స్టేడియంలో జరిగిన త్వైకాండో పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిందన్నారు. ఈనెల 11, 12 తేదీల్లో బాపట్ల జిల్లా రేపల్లె మండలం పేరూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆమె పాల్గొననుందని తెలిపారు. విద్యార్థిని రాష్ట్ర స్థాయిలోనూ ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. విద్యార్థినితో పాటు ఇందుకు కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరెడ్డిని అభినందించారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చైర్మన్, కరస్పాండెంట్

కల్లూరు: దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం లీనియర్ ఆల్జీబ్రా అండ్ కాల్కులస్ ఫర్ ఇంజినీరింగ్ పుస్తకాన్ని కళాశాల చైర్మన్ డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, కరస్పాండెంట్ విజయలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ పుస్తకం ఇంజినీరింగ్ విద్యార్థుల్లో గణితంపై నమ్మకం, ఆసక్తి పెంపొందిస్తుందని తెలిపారు. పుస్తక రచయితలు డాక్టర్ ఎం. హరికృష్ణ, డాక్టర్ ఎ.షరీఫ్, డాక్టర్ బి. లక్ష్మన్న, జి. బాలకృష్ణమ రాజు మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యార్థులతో పాటు గేట్ వంటి పోటీ పరీక్ష సిద్ధతకు ఉపయోపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కల్లూరు: విశాఖపట్నంలో డిసెంబర్ 31, జనవరి 1, 2, 3, 4 తేదీల్లో జరగనున్న సీఐటీయూ ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు సుధాకరప్ప, ఏసు అన్నారు. గురువారం కల్లూరు సూర్యనారాయణ భవనంలో శరీన్‌నగర్ మట్టిపని మేస్త్రీ కార్మికుల సమావేశం నిర్వహించారు. కార్మికులు శ్రమను దారపోసి దేశాభివృద్ధి కోసం కష్టపడుతుంటే ప్రస్తుత ప్రభుత్వాలు వారి శ్రమను గుర్తించకుండా శ్రమ దోపిడీ చేస్తున్నాయన్నారు. కార్మిక చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్లు తీసుకొచ్చి కార్మికులకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. కార్మికుల పని గంటలు పెంచడంతోనే వారిపై పాలకులకు ఎలాంటి చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు. నాయకులు వెంకటేశ్వర్లు, కిషోర్, మరియమ్మ, శాంతమ్మ, లక్ష్మిదేవి, రమాదేవి, సరోజమ్మ, శేషమ్మ, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

తపాలా సేవలపై విద్యార్థులకు అవగాహన



తపాలా సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కోడుమూరు రూరల్: ప్రపంచ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక నాగార్జున విద్యానిలయం విద్యార్థులకు ఉపాధ్యాయులు తపాలా సేవలపై అవగాహన కలిపించారు. ముందుగా విద్యార్థులు పాఠశాల నుంచి ర్యాలీగా కోడుమూరు పోస్టాఫీస్‌కు వెళ్లి తపాలా శాఖ అందించే సేవలను తెలుసుకున్నారు. స్టాంపుల ప్రాధాన్యత తదితర వాటి గురించి భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ నాగార్జున యాదవ్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సురేంద్రరెడ్డి, రవితేజ, ఉదయ్, లక్ష్మన్న, వెంకటరమణ, రవిప్రకాష్, భారతి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి క్రీడా పోటీలు

పాణ్యం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం ఉదయం మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం కానున్నట్లు హెచ్ఎం రాములు నాయక్ గురువారం తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలలకు చెందిన బాలబాలికలకు పోటీలు జరుగుతాయన్నారు. అండర్ 14,17 విభాగాల్లో 7 రకాల క్రీడల్లో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. విద్యార్థులు ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.

'కూటమి' పాలనలో దళితులపై వివక్ష



సమావేశానికి హాజరైన దళితులు

- అట్టడుగు వర్గాలను అణచి వేస్తున్నారు
- ఒక్క హామీని కూడా అమలు చేయలేదు
- హక్కులను అడిగితే బెదిరిస్తున్నారు
- తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారు
- దళితులను భయపెట్టడమే చంద్రబాబు సిద్ధాంతం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

బొమ్మలసత్రం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులపై వివక్ష పెరిగిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆరోపించారు. అట్టడుగు వర్గాలను సీఎం చంద్రబాబు అణచి వేస్తున్నారని విమర్శించారు. దళితులను భయపెట్టి అణగదొక్కటమే లక్ష్యంగా పాలన సాగుతోందని ధ్వజమెత్తారు. నంద్యాల పట్టణంలోని తేజస్విని హోటల్‌లో గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ విభాగం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ కనకరావు, పార్లమెంట్ పరిశీలకురాలు కల్పలతారెడ్డి, నందికొట్కూరు ఇన్‌చార్జ్ దారా సుధీర్ కుమార్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు తిరుపతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

భయపెడుతూ తప్పుడు కేసులు

తన ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి రాక్షస పాలనను ఎప్పుడూ చూడలేదని కాటసాని అన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేస్తూ భయాందోళనకు గురిచేస్తున్నారన్నారు. ఓర్వకల్లు మండలంలో రమేష్ అనే దళిత కార్యకర్తపై ఐదు తప్పుడు కేసులు నమోదు చేశారన్నారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో టీడీపీ అధినేత చంద్రబాబు అధికారం దక్కించుకుని ఏ ఒక్క హామీని సరిగ్గా అమలుచేయలేదన్నారు. టీడీపీ నేతలకు కొందరు అధికారులు తొత్తులుగా మారుతున్నారని, రానున్న రోజుల్లో అటువంటి వారిని ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు.

రాష్ట్రంలో 'రెడ్‌బుక్' పాలన

రాష్ట్రంలో 'రెడ్‌బుక్' పాలన సాగుతోందని కాటసాని విమర్శించారు. దళితులను దివంగత నేత వైఎస్సార్ ఆదుకున్నారని, మహానేత తర్వాత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే దళితులకు అండగా నిలిచారని పేర్కొన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాజకీయాలకు, పార్టీలకు అతీతంతా సంక్షేమ పథకాలు అమలయ్యాయన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంతో పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మంచి స్థానంలో నిలిచారన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలన్న లక్ష్యంతో ఆరోగ్యశ్రీని అమలు చేస్తే కూటమి ప్రభుత్వం దాన్ని నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. దళితులు బాగుపడాలంటే వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావాలన్నారు.



మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

దళితుల ద్రోహి చంద్రబాబు



దళితుల ద్రోహి ముమ్మాటికీ చంద్రబాబే అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబు అన్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు దళితులకు రూ.70 వేల కోట్లు వివిధ సంక్షేమ పథకాల ద్వారా పంచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. సీఎం చంద్రబాబు అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కారని, ఇకపై ఇలాంటి మోసాలు ప్రజలు నమ్మబోరన్నారు. రాష్ట్రంలో లక్ష మందితో జగనన్న దళిత ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో గ్రామ స్థాయి నుంచి దళితులు సభ్యులుగా ఉంటారన్నారు.

కనిపించని సంక్షేమం'



రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కనిపించడం లేదని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకురాలు, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి అన్నారు. పేద పిల్లలకు వైద్య విద్యను అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు నిర్మాణానికి కృషి చేశారన్నారు. దళిత కుటుంబాల్లో కూడా సులభంగా వైద్యవిద్యను అభ్యసించే అవకాశాలు కల్పించారని పేర్కొన్నారు. ఈ కాలేజీలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ విధానమంటూ ఆర్వో ప్లాంట్‌ను కూడా రిపేరీ చేయించకుండా ప్రజల ప్రాణాలు తీస్తోందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీకి దళితులు గట్టి పునాదులన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ విజువల్ ఆర్ట్స్ డైరెక్టర్ సునీత అమృతరాజ్, ఉమ్మడి జిల్లాల ఎస్సీ సెల్ సమన్వయకర్త యోబు, ఎస్సీ సెల్ నంద్యాల అధ్యక్షుడు నాగేశ్వరరావు, నియోజకవర్గాల అధ్యక్షులు పుల్లయ్య, సత్యం, జయపాల్, వెంకటేశ్వర్లు, హేమలత, మండలాధ్యక్షులు ఆర్థర్ సైమన్, శెట్టిప్రభాకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాముషావలి, ఎస్సీ సెల్ నేతలు మద్దయ్య, పార్టీ అధికార ప్రతినిధి అనిల అమృతరాజ్, చాణక్యరాజ్, కౌన్సిలర్ మేస చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించాలి



జీఎస్టీ తగ్గింపు ఉపయోగాలను ప్రజలకు వివరిస్తున్న వైద్యాధికారి డా.ప్రత్యూష

కోడుమూరు రూరల్: జీఎస్టీ తగ్గింపు వల్ల వివిధ వర్గాల ప్రజలకు చేకూరే ప్రయోజనాలను తెలియజేయాలని గూడూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డా.ప్రత్యూష సూచించారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో జీఎస్టీ సూపర్ సేవింగ్ కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా డా.ప్రత్యూష మాట్లాడుతూ వైద్య పరికరాలు, మందులపై జీఎస్టీ ఇదివరకు 18శాతం జీఎస్టీ ఉండేదని, ఇప్పుడు దీనిని 5శాతానికి తగ్గించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శాంతకుమారి, డీవైహెచ్‌ఈఓ కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని నిరసన



వార్డు సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కల్లూరు: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన పేదలందరికీ స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం కల్లూరు అర్బన్ 97, 107, 108 వార్డు సచివాలయాల వద్ద సీపీఐ నగర కార్యవర్గ సభ్యుడు అన్వర్ అధ్యక్షతన ధర్నా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు స్థలం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి 16 నెలల గడుస్తున్నా ఇంటి స్థలాలు ఇస్తామంటున్నారే తప్ప ఎప్పుడు ఇస్తారో చెప్పడం లేదన్నారు. ఇంటి స్థలాలతో పాటు నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేయాలన్నారు. సీపీఐ నాయకులు రహమతుల్లా, కృష్ణ నాయక్, రామాంజనేయులు, అబ్రహాం, యాకోబు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలి



డ్రైనేజీని చూపిస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: కల్లూరు అర్బన్ వార్డుల్లోని కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు సుధాకరప్ప డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం ప్రతినిధి బృందం కల్లూరు అర్బన్ 32వ వార్డులోని సుందరయ్య నగర్, గంగావతినగర్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గంగావతి నగర్‌లో పైపులైన్ మరమ్మతుల కోసం కొద్ది రోజులుగా అలాగే ఉంచారన్నారు. దీంతో పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. డ్రైనేజీ కాలువలు పూడికతో నిండాయని తెలిపారు. నాయకులు హుస్సేన్ బాషా, విజయ్ కుమార్, సురేష్, దావీదు, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వలిబాషా తదితరులు పాల్గొన్నారు.

- కల్లూరు అర్బన్ 36వ వార్డు పెద్దపాడులోని సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు గోపీనాథ్, రాజు, శ్రీనివాసులు, వరలక్ష్మీ, దినేష్, భీమన్న డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు గ్రామంలో పర్యటించారు.



కుంగిన కల్వర్టుపై కొద్దిగా గ్రావెల్ చల్లి, పక్కన పుల్లలు ఏర్పాటు చేసిన దృశ్యం

తూతూ మంత్రంగా..

సి.బెళగల్: ప్రజల ప్రాణాలు అంటే ఆర్అండ్‌బీ అధికారులకు లెక్కలేనట్టు ఉంది. ప్రధాన రోడ్డులో కల్వర్టు కుంగి ప్రమాదకరంగా ఉంటే తూతూమంత్రంగా మట్టి పోసి వదిలేశారు. సి.బెళగల్ - గూడూరు వెళ్లే దారిలో సి.బెళగల్ శివారులోని ఇటుకల బట్టీల దగ్గర ప్రధాన రోడ్డుపై కల్వర్ట్ రెండు వైపులా కుంగింది. వాహనదారులు ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదం బారిన పడాల్సిందే. ఎందుకంటే దెబ్బతిన్న కల్వర్టు వద్ద హెచ్చరిక బోర్డు కూడా లేదు. ఇదే విషయాన్ని గురువారం ప్రమాదం అంచున ప్రయాణం శీర్షికన 'సాక్షి' కథనాన్ని ప్రచురించి సమస్యను వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు గురువారం కల్వర్టు కుంగిన చోట కొద్దిగా గ్రావెల్ వేసి, పక్కన ఓ ముళ్లచెట్టు పుల్లను హెచ్చరిక బోర్డులా ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. సమస్యల పరిష్కారంలో అధికారుల వ్యవహరిస్తున్న తీరుకు ఈ ఘటన అద్దపడుతోంది.

గెస్ట్‌హౌస్ నిర్మాణానికి ప్రతిపాదనలు

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలో రూ.2.50 కోట్లతో ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపినట్లు ఆర్అండ్‌బీ ఏఈ వెంకటేశ్వర్రెడ్డి గురువారం తెలిపారు. పాణ్యంలో శిథిలమైన భవనాన్ని తొలగించి నూతన భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అనుమతులు రాగానే నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే పాణ్యం-కొణిదేడు గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లతో టెండర్ ప్రక్రియ జరుగుతోందని. త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

నేడు శనగ విత్తనాలు పంపిణీ

ఓర్వకల్లు: ఈ ఏడాది రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు శుక్రవారం ఉదయం నుంచి విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారిణి మధుమతి గురువారం తెలిపారు. మండలానికి 1000 క్వింటాళ్ల శనగ విత్తనాలు అవసరమున్నట్లు అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. తొలి విడత 500 క్వింటాళ్లు మంజూరు చేయగా, ప్రస్తుతం 250 క్వింటాళ్లు సరఫరా చేసినట్లు తెలిపారు. మార్కెట్‌లో క్వింటా శనగ విత్తనం రూ.7,800 కాగా 25 శాతం రాయితీ రూ.1950 పోను రైతు వాటా కింద రూ. 5,850 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే 20 కిలోల బస్తా రూ.1,170 చెల్లించాలని పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనగ విత్తన పంపిణీని ఎమ్మెల్యే గౌరు చరితా ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

కర్నూలు: ప్రధానమంత్రి కర్నూలు పర్యటన నేపథ్యంలో భద్రత కారణాల దృష్ట్యా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. నగర సరిహద్దులో ఉన్న ప్రధాన మార్గాల్లో చెక్ పాయింట్లు ఏర్పాట్లు చేసి విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని పుల్లూరు టోల్‌గేట్, మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నంద్యాల చెక్‌పోస్టు, నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉల్చాల రోడ్ జంక్షన్, గుత్తి పెట్రోల్ బంకు దగ్గర, ఓర్వకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోని నన్నూరు టోల్ గేట్ వద్ద చెక్ పాయింట్‌ను ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నారు. అలాగే అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో లాడ్జిలలో తనిఖీలు నిర్వహించారు. స్పెషల్ పార్టీ పోలీసులు అనుమానిత వ్యక్తులు లేదా అనుమానిత వస్తువులను గుర్తించడానికి విస్తృత తనిఖీలు చేపట్టారు. ప్రధాని పర్యటించే మార్గాల్లో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు కూడా నిర్వహించారు. ఎయిర్ పోర్టు నుంచి హెలిప్యాడ్ వరకు, బహిరంగ సభ నిర్వహించే ప్రాంతాల్లో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించారు.

మొబైల్ వల్లే దృష్టి సమస్యలు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.సత్యనారాయణ రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ప్రస్తుతం చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అతిగా టీవీలు, మొబైల్ ఫోన్‌ను వాడటం వల్లే దృష్టి సమస్యలు అధికంగా వస్తున్నాయని ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.సత్యనారాయణరెడ్డి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి డాక్టర్ సంధ్యారెడ్డి చెప్పారు. ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కంటి ఆసుపత్రి నుంచి ప్రభుత్వ సర్వజన వైద్యశాల మీదుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కంటి జబ్బులు రాకుండా, వచ్చిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పిల్లల్లో దృష్టిలోపాలను గుర్తించేందుకు 18 ఏళ్లలోపు విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆర్ఎంఓ డాక్టర్ భరత్, వైద్యులు, హెల్త్ ఎడ్యుకేటర్, నర్సులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శరవేగంగా ప్రధాని పర్యటన ఏర్పాట్లు



ఫీల్డ్ మ్యాప్ ద్వారా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఓర్వకల్లు: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జిల్లా పర్యటన నేపథ్యంలో అధికార యంత్రాంగం చేపట్టిన ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. గురువారం జిల్లా కలెక్టర్ ఏ.సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి నన్నూరు సమీపంలోని రాగమయూరి గ్రీన్ హిల్స్‌ను సందర్శించారు. వాహనాల పార్కింగ్, హెలీప్యాడ్, సభా ప్రాంగణం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎలాంటి లోపాలకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు బహిరంగ సభ ప్రాంతంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీఎంఓ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏర్పాట్ల గురించి కలెక్టర్ సిరి వివరించారు. జాయింట్ కలెక్టర్ నవ్య, సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్డీఓ సందీప్ కుమార్, తహసీల్దార్ విద్యాసాగర్ ఉన్నారు.

పట్టించుకునేవారే లేరు



వెంకటగిరిలో పగటిపూట వెలుగుతున్న వీధిలైట్లు

కోడుమూరు రూరల్: మండలంలోని వెంకటగిరి గ్రామంలో పగలు, రాత్రి అన్న తేడా లేకుండా గత కొద్ది రోజుల నుంచి వీధిలైట్లు నిత్యం వెలుగుతూనే ఉన్నాయి. వీధిలైట్లను రాత్రి వేళల్లో ఆన్ చేసి పగటి పూట ఆఫ్ చేయాల్సి ఉంటుంది. అయితే, పంచాయతీ సిబ్బంది పట్టించుకోకపోవడంతో అవి నిత్యం వెలుగుతూనే ఉన్నాయి. దీని వల్ల గ్రామ పంచాయతీకి కరెంట్ బిల్లు తడిసి మోపెడయ్యే పరిస్థితి దాపురించింది. ఇదిలా ఉంటే నిత్యం కొన్ని వీధుల్లో లైట్లు వేసి ఉంచడం వల్ల గ్రామంలో మిగతా చోట్ల రాత్రిపూట వీధిలైట్లు పడడం లేదని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి పగటి వేళల్లో వీధిలైట్లు వెలగకుండా చర్యలు తీసుకోవడంతో పాటు పాడైపోయిన లైట్ల స్థానంలో కొత్తవి వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భద్రతా లోపాలకు తావివ్వొద్దు



పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: జీఎస్టీ సంస్కరణ ఉత్సవ్‌లో భాగంగా ఈనెల 16న కర్నూలులో నిర్వహించనున్న ప్రధాని బహిరంగ సభకు భద్రతపరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులకు సూచించారు. ఓర్వకల్లు మండలం నన్నూరు రాగమయూరిలో బహిరంగ సభ ప్రాంతం వద్ద ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రధాని పర్యటన ఏర్పాట్లపై ఎస్పీ సమీక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రధాని పర్యటించే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి సెక్టార్‌కు ఇన్‌చార్జులుగా, భద్రత పర్యవేక్షణ అధికారులుగా పోలీసు ఉన్నతాధికారులు ఉంటారని, సీఐలు, ఎస్ఐలు లైజనింగ్ ఆఫీసర్లుగా ఉంటారన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి భద్రతను కట్టుదిట్టం చేయాలన్నారు. అనంతరం హెలిప్యాడ్ ప్రాంతాలు, వీవీఐపీ కాన్వాయ్ పర్యటించే ప్రాంతాలు, వీవీఐపీ, పబ్లిక్ గ్యాలరీలను ఎస్పీ పరిశీలించారు. అడిషనల్ ఎస్పీలు హుసేన్ పీరా, కృష్ణమోహన్, డీఎస్పీలు, స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు కార్యక్రమంలో పాల్గొన్నారు.